పోలింగ్ శాతం పెంచడంపై దృష్టి



బొటానికల్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కటౌట్

గచ్చిబౌలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రజనికాంత్‌రెడ్డి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోలింగ్ తేదీ, నమూనా బ్యాలెట్ పేపర్ తరహాలో భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జనసమూహం ఎక్కువగా ఉండే శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ గేటు పక్కన ఏర్పాటు చేశారు. దీనిపై 'ఐ విల్ ఓట్ ఆన్ మే 13' అని రాశారు. ఈ విషయంపై డీసీ రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద ఈ కటౌట్‌లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. అందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రాయదుర్గంలో బీజేపీ ఎన్నికల ప్రచారం


రాయదుర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయదుర్గం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణముదిరాజ్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు నీలం నరేందర్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కేంద్రం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు నరేందర్‌గౌడ్, సురేష్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, దయాకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం


రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న జైపాల్

చందానగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జైపాల్ అన్నారు. మంగళవారం ఆయన చందానగర్‌లో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓట్లు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వమని, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, పోచయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే తగిన గుర్తింపు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, బాచుపల్లి 21వ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సిద్దు, మణికంఠ, గౌతమ్, సల్మాన్, ప్రసాద్, అశోక్, మురళీ పాల్గొన్నారు.


సునీతామహేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ప్రజలు

కాంగ్రెస్ పార్టీకి కంచుకోట మల్కాజిగిరి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరి కంచుకోట అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్‌లోని సంక్షేమ, కుల సంఘాల ఆత్మీయ సమావేశం సుచిత్రా టీఎస్ఆర్ గార్డెన్‌లో, కుత్బుల్లాపూర్ కల్పనా సొసైటీలో గుజరాతి కమ్యూనిటీహాల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీశైలంగౌడ్‌తో పాటు మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలపరిచిన సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని, కుల, సంక్షేమ సంఘాల సభ్యులను కోరారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా వీరికి సునీతామహేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కేఎం ప్రతాప్‌గౌడ్, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బి.శోభారాణి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎన్.భూపతిరెడ్డి, కె.జోష్నా, ఎస్.పున్నారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


హఫీజ్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న సీతారెడ్డి, పూజిత, నాయకులు

హఫీజ్‌పేటలో కాంగ్రెస్ ప్రచారం

మియాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చేయి గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. మంగళవారం హఫీజ్‌పేటలో డివిజన్‌లో సీతారెడ్డి, కార్పొరేటర్ పూజిత, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించే కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వారు ఓటర్లను కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన శంకర్‌గౌడ్


శంకర్‌గౌడ్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గచ్చిబౌలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు కోమరగొని శంకర్‌గౌడ్ మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్‌రెడ్డి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్, మన్నేపల్లి సాంబశివరావు, నర్సింహగౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రోడ్డు పాలు


రోడ్డుపై పారుతున్న తాగునీరు

మియాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మదీనగూడలో తాగునీటి పైపులైను లీకేజీతో తాగునీరు రోడ్డు పాలయింది. లక్షల లీటర్ల తాగునీరు వృథా అవుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

కుక్కల స్వైరవిహారం

భయాందోళనలో ప్రజలు


వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు కనిపిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నియోజకవర్గం పరిధిలో వరుసగా జరుగుతున్న కుక్క కాటు ఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 12వ తేదీన దుండిగల్ మున్సిపల్ పరిధిలోని, దుండిగల్ గ్రామంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న అన్వన్యను(4)పై రెండు వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో స్థానికులు, తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈనెల 13న జీడిమెట్ల డివిజన్‌లోని గాయత్రినగర్‌లో గుడెసెలో జీవిస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కార్మికుడు కూతురు దీపాలి(2)పై కుక్కలు దాడి చేసి తల, శరీరంపై తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబసభ్యులు నిలోఫర్ ఆస్పత్రికి తీసుక వెళ్లారు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఈనెల 15న గాజులరామారం సర్కిల్‌లోని హెచ్‌ఏఎల్ కాలనీలో ఓ వ్యక్తిపై వీధి కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు.

వారం రోజులలోపే మూడు సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయపడుతున్నారు. కుక్కలను నియంత్రించడంలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో సంచరించే కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకెళ్లి, ఆపరేషన్ చేసి మళ్లీ వారం తరువాత అదే స్థలంలో వదిలివెళ్లడంతో అవి పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ వీధుల్లో వెళ్లేవారిపై, ఇంటి ముందు ఆడుకునే చిన్నారులపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు. గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని పలు బస్తీల్లో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయని, ఉదయం, రాత్రి సమయంలో రోడ్లపై ప్రయాణం సాగించే బాటసారులు, వాహనదారులపై పెద్దపెద్దగా అరుస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తీసుకెళ్తున్నారు.. వదిలేస్తున్నారు



కాలనీలు, బస్తీల్లో కుక్కల సమస్య అధికంగా ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు వాటిని అధికారులు బంధించి తీసుకెళ్తున్నారు. కొన్ని రోజుల తరువాత మళ్లీ కాలనీలో వదిలివేస్తున్నారు. కాలనీల్లో గుంపులుగుంపులుగా సంచరిస్తున్న కుక్కలను చూసి ప్రజలు భయపడుతున్నారు. కుక్కల నుంచి ప్రజలను కాపాడాలి.

\- భాను, హెచ్‌ఏఎల్ కాలనీ



చోరీలు చేస్తున్న నలుగురు యువకుల రిమాండ్

జీడిమెట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న నలుగురు యువకులను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి విలువైన సొత్తును రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌కు చెందిన షేక్ దస్తగిరి బాబా(32), రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడి నుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు సాధీనం చేసుకున్నారు. అదే విధంగా జగద్గిరిగుట్టకు చెందిన గందెశ్రీ శివకుమార్(34) పార్కుచేసిన బైక్‌లను దొంగిలిస్తున్నాడు. అతడి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జీడిమెట్ల రామిరెడ్డినగర్‌కు చెందిన పొన్న సాయిలు ((34), బైక్‌లను దొంగిలిస్తున్నాడు. సాయిలు నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగడ్డకు చెందిన ఎం.డీ. అన్సారి(21) పాన్ డబ్బాలలో దొంగతనం చేస్తుంటాడు. ఇతని వద్ద నుంచి 11 వేల రూపాయల నగదు రికవరీ చేశారు. పోలీసులు నలుగురిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ చేసిన వాహనాలతో స్టంట్లు

- సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- ఫేమస్ అవుదామని అరెస్టయ్యారు
- బేగంపేటలో ఇద్దరి అరెస్టు
- 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రోహిణి ప్రియదర్శిని

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలతో విన్యాసాలు చేసి ఫేమస్ కావాలనుకున్నారు.. పలు రకాల వాహనాలతో విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెట్టారు.. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే వీరు విన్యాసాలు చేసిన వాహనా లు చోరీ చేసినవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టి వారి నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. చాంద్రాయణగుట్ట సమీపంలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం(19), బేగంపేట పాటిగడ్డకు చెందిన బాలుడు కలిసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లను తొలగించి షాహీన్‌నగర్‌లోని నగర శివారు ప్రాంతాల్లో స్టంట్లు నిర్వహించేవారు. వీరు చేసిన విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులతో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలోని తన వాహనం చోరీకి గురైందని స్మితపటేల్ ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను విశ్లేషించగా చోరీకి గురైన వాహనాలు షాహీన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. దీంతో అడ్మిన్ ఎస్సై గంగాధర్ నేతృత్వంలో క్రైం పోలీసులు షాహీన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులు షేక్ ఇబ్రహీం, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను చోరీచేసి వాటి మీద విన్యాసాలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో పోస్టులు పెట్టి తద్వారా ఫేమస్ కావాలనుకున్నామని వీరు పోలీసులకు తెలిపారు. పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 వాహనాలు చోరీ చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి డియో వాహనాలు 7, జుపిటర్ 1, యమహా ఆర్‌ఎక్స్ 1 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

- కేసు నమోదు చేయని పోలీసులు

జీడిమెట్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అపురూపకాలనీలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి యుకుడిని కత్తితో పొడిచి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. యువకుడు అతడి నుంచి కాపాడుకోవడానికి చేతిని అడ్డుపెట్టడంతో చేతికి బలమైన గాయమైంది. పోలీసులు రెండు రోజులైనా ఈ సంఘటనపై కేసు నమోదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీకొట్టులో పనిచేసే వంశీ(18) రెండు రోజుల క్రితం అపురూపకాలనీలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. బంధువుల ఇంటిముందు ఉన్న ఓ వ్యక్తి తప్పతాగి అకారణంగా గొడవపడి వంశీపై కత్తితో దాడి చేశాడు. బాధితుడు రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా జీడిమెట్ల పోలీసులు పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ఓ మాజీ కార్పొరేటర్ పలుకుబడితో కేసు పెట్టకుండా పైరవీ చేస్తున్నట్టు తెలిసింది. కాలనీవాసులంతా కేసునమోదు చేయాలని కోరుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వస్తున్నాయి.ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చందానగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్ వెనుక సుమారు 40-45 వయస్సున్న వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు చందానగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

గచ్చిబౌలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కొండాపూర్ నెక్టార్ గార్డెన్ వద్ద జరుగుతున్న వరద, మురుగునీటి కాల్వ పనులు పరిశీలించారు. అనంతరం ఖాజాగూడలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, డీసీ రజనికాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్య నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

నాలుగోఫేజ్‌లో సీతారాముల కల్యాణం నేడు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని సిద్ధివినాయక భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయంలో బుధవారం శ్రీరామ నవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, కోదండరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులు కల్యాణానికి హాజరుకావాలని కోరారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాధవరం కాంతారావు

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కాలనీలు, రహదారుల పక్కన చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని టెంపుల్ బస్టాపు వద్ద మధుకర్ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. తోట రమేష్‌నాయుడు, సుభాష్‌చంద్రబోస్, కర్ర గోపి పాల్గొన్నారు.

- **చందానగర్‌లో..**

చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపతాయని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ అన్నారు. చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు.

ఎంఎల్ఆర్ బ్యాడ్మింటన్ విజేత సుజయ్

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మర్రి లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ బ్యాడ్మింటన్ పోటీల్లో సుజయ్‌రూపక్ వర్మ విజేతగా నిలిచాడు. మంగళవారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీలో జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్‌లో బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సుజయ్ (ఎంఎల్ఆర్ఐటీ) విజేత నిలవగా, జాన్సన్ (సీఎంఆర్) రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో ప్రశాంతిరెడ్డి (ఎంఎల్ఆర్ఐటీ) టైటిల్ సాధించగా, తేజశ్విని (కేఎల్ యూనివర్సిటీ) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ప్రణీత్ (జీఆర్ఐఈటీ కళాశాల) విజేతగా నిలవగా, శివకుమార్ (జేబీఐఈటీ) ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. డబుల్స్‌లో లోకేష్ గౌడ్- శశాంక్ (సెయింట్ మార్టిన్స్) జోడీ టైటిల్ కైవసం చేసుకుంది. చెస్‌లో విష్ణువర్ధన్ (ఎంఎల్ఆర్ఐటీ), అమూల్య (జీఆర్ఐఈటీ కళాశాల) విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ ధీరెన్‌రెడ్డి ట్రోఫీలు ప్రదానం చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


సుదర్శన హోమంలో జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలతో పాటు సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం శ్రీవారు, అమ్మవార్లను రథంపై ఊరేగించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

- **సీఎంఆర్ఎఫ్ సాయం**



శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ సుభాష్‌చంద్రబోస్ నగర్‌కు చెందిన రాధికకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదలైన రూ.35 వేల విలువ చేసే చెక్కును మంగళవారం సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

\- వివేకానందనగర్‌కాలనీ

ఎమ్మెల్యేను కలిసిన ప్రజలు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్లలోని దండమూడి ఎన్‌క్లేవ్‌లో గల ఆయన నివాసంలో కలిసి తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

\- పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి

ఓపెన్ ప్లాట్ల కొనుగోలు పేరుతో మోసం

ఇద్దరిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేసి తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు గడించొచ్చని మోసానికి పాల్పడిన ఇద్దరిని సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు మానిక్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏరువ శ్రీలక్ష్మిలు సంగారెడ్డి అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో స్ప్రింగ్ సిటీ పేరుతో వెంచర్లు విక్రయించారు. తమ వెంచర్లలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ప్రచారం చేసుకున్నారు. వీరి మాటలు నమ్మిన స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీలో అడ్మిన్ అధికారిగా పని చేస్తున్న ఎం.వెంకటేశం, పలువురు పెట్టుబడులు పెట్టారు. లాభాలు రాకపోగా పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి ఇవ్వకపోవడంతో వీరందరూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు దర్యాప్తు జరిపి మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితులు మానిక్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏరువ శ్రీలక్ష్మిలను అరెస్ట్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పైపులైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

హైదరనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ మంజీర పైపులైన్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శేఖర్, కుమార్‌యాదవ్, ఉపేందర్, వెంకటేష్, నరేందర్, ధనుంజయ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గాజులరామారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో పని చేసేందుకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సూరారం శివాలయం నగరంలో నివాసం ఉండే క్రాంతికుమార్ భార్య జె.ప్రగతి(24) ఇంట్లోనే ఉంటుంది. ఈనెల 12న సూరారం సాయిబాబా టెంపుల్ సమీపంలో గల రెయింబో ట్రావెల్స్‌లో భీమవరం వెళ్లేందుకు బస్‌టికెట్ బుక్ చేసుకున్నట్లు భర్తతో చెప్పింది. దీంతో రాత్రి ప్రగతిని బస్సు ఎక్కించాడు. 13న భీమవరంలో దిగవలసిన ప్రగతికి బస్సు దిగలేదు. భర్త ఫోన్ చేసినా తీయలేదు. దీంతో ఆందోళనకు గురైన భర్త ట్రావెల్స్ ఏజెంట్‌ను సంప్రదించాడు. ప్రగతికి సుబ్బుయాదవ్ అనే వ్యక్తి టికెట్ బుక్ చేసినట్లు తెలిపాడు. దీంతో ఆమె గురించి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ప్రయోజనం లేదు. దీంతో మహిళ భర్త సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అభయ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదరనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని కమలమ్మ కాలనీలోని అభయ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డీవీజీ ట్రస్ట్ ద్వారా దేవాలయానికి రూ.21 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాండుగౌడ్, రాజుపటేల్, కృష్ణారావు, మల్లేశ్, మురళి, శంకర్‌రావు, ఉమామహేశ్వరరావు, శంకర్‌గౌడ్, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను కలిసి కాలనీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో తాగునీరు, సీసీరోడ్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, వెంకటేష్‌గౌడ్, సంపత్‌రెడ్డి, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

